మ్యూజియాలకు పెరుగుతున్న ఆదరణ

- నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక కార్యక్రమాలు
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం



చార్మినార్: పాతబస్తీలోని మ్యూజియంలు ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఇహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ తదితర మ్యూజియంలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ప్రతిరోజూ దేశ, విదేశాల పర్యాటకులు ఈ మ్యూజియాలను సందర్శిస్తున్నారు. దీంతో పాతబస్తీలోని మ్యూజియాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. అంతర్జాతీయ మ్యూజియంల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాలార్‌జంగ్ మ్యూజియంలో 'మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'పేరుతో ప్రత్యేక కార్యక్రమం జరుగనుంది.

సాలార్‌జంగ్ మ్యూజియం..

దారుషిఫా చౌరస్తాకు సమీపంలో మూసీనది పక్కన 1968లో నూతనంగా నిర్మించిన భవనంలోకి సాలార్‌జంగ్ మ్యూజియాన్ని మార్చారు. అంతకుముందు సాలార్‌జంగ్ మ్యూజియం దివాన్‌దేవుడీలో కొనసాగింది. 1, 2, 3 సాలార్ జంగ్‌లు భారతదేశంతో పాటు విదేశాల నుంచి సేకరించిన దాదాపు 48 వేల కళాఖండాలను మ్యూజియంలో పొందుపరిచారు. రెబేకా(పాలరాతి ముసుగు సుందరి) గంటలు కొట్టే గడియారాలతో పాటు చైనా, జపానీస్, యూరోపియన్ పెయింటింగ్‌లతో కూడిన గ్యాలరీలు, అరుదైన కళాఖండాలు మ్యూజియంలో సందర్శకులను మంత్ర ముగ్ధలను చేస్తున్నాయి. అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన సాలార్‌జంగ్ మ్యూజియంలో నిజాం నగల ప్రదర్శన కూడా జరిగింది.

హెచ్‌ఇహెచ్ నిజాం మ్యూజియం..

2000 ఫిబ్రవరి 18 నుంచి పురానాహవేలీలో కొనసాగుతోంది. నిజాం వంశ పాలకుడైన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో రాజ్యాధికారం చేపట్టాడు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఆయన 1937లో తన పాతికేళ్ల పరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. దీంతో పాతికేళ్ల విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం కనీవినీ ఎరగని రీతిలో ఏర్పాట్లు చేశారు. నిజాం రజతోత్సవ వేడుకల్లో దేశవిదేశాల నుంచి ఎందరో ప్రముఖులు హాజరై బహువుతులు అందజేశారు. వీటిలో ప్రతి బహువుతి ఎంతో విలువైంది. ఈ బహుమతులన్నింటినీ ఒక దగ్గర చేర్చి ప్రజల సందర్శనార్థం పురానీహవేలీలో నిజాం మ్యూజియంను ఏర్పాటు చేశారు. 2000 ఫిబ్రవరి 18 నుంచి ఈ బహుమతులను ప్రదర్శనలో ఉంచారు. ఈ మ్యూజియంలో నిజాం నవాబులు వాడిన ఎన్నో వస్తువులు కూడా ఉన్నాయి. బంగారంతో తయారు చేసిన సింహాసనం, వివిధ భవనాల నిర్మాణాల కోసం ఉపయోగించిన వెండి, బంగారంతో చేసిన గంపలు, తాపీలు, భవన నిర్మాణానికి ఉపయోగించే వివిధ పరికరాలు, దేశంలోనే తొలిసారి చేతితో నడిపిన లిఫ్ట్, ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ చెక్కతో తయారు చేయించిన ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అల్మారా ఇక్కడ కొలువు దీరాయి.



పురానీహవేలీలోని హెచ్‌ఇహెచ్ నిజాం మ్యూజియం


చౌమహల్లా ప్యాలెస్

చౌమహల్లా ప్యాలెస్..

చార్మినార్ కట్టడం నుంచి వాకబుల్ డిస్టెన్స్‌లో ఉన్న చౌమహల్లా ప్యాలెస్ యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం. ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి. 5వ నిజాం అఫ్జల్-ఉద్- దౌలా-బహదూర్ పాలనా (1857-69) కాలంలో ఖిల్వత్ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది. టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్ మహల్, మహ్తాబ్ మహల్, తహనియత్ మహల్, అఫ్జల్ మహల్‌ల నిర్మాణం జరిగింది. 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో ప్యాలెస్ మరింత శోభాయమానంగా మారింది. ఇది నిజాం ప్రభువుల నివాస గహంగా ఉండేది. ఆనాటి కాలంలో విద్యుత్ లైట్లు లేని కారణంగా ప్యాలెస్‌లో వెలుగుల కోసం షాండిలియర్లను ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి వచ్చే అతిథులందరికీ చౌమహల్లా ప్యాలెస్‌లో ఆతిథ్యమిచ్చేవారు. నిజాం కాలంలో వినియోగించిన ఫర్నీచర్, మంచాలు, దుస్తులు, తల్వార్లు, ఫొటోలు తదితర విలువైన పురాతన వస్తువులన్నింటినీ చౌమహల్లా ప్యాలెస్‌లోని నాలుగు ప్యాలెస్‌లలో భద్రపరిచారు. ప్రస్తుతం నిజాం ట్రస్ట్ పర్యవేక్షణలో చౌమహల్లా ప్యాలెస్ కొనసాగుతోంది.

నిలోఫర్‌కు 33 ఫస్ట్‌కేర్ బేబీ వార్మర్స్ వితరణ


బేబీ వార్మర్స్‌ను వితరణ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నాంపల్లి: రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌రైజెస్ సర్వీస్ ట్రస్ట్ నిలోఫర్ ఆసుపత్రికి 33 ఫస్ట్‌కేర్ బేబీ వార్మర్స్‌ను వితరణ చేసింది. శనివారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ శంకర్‌రెడ్డి బుసిరెడ్డి హాజరై నిలోఫర్ వైద్యాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు క్రిష్ణ నేరెళ్ల, కార్యదర్శి విక్రమ్ మెహతా, కోశాధికారి పంకజ్ అగర్వాల్, ట్రస్ట్ చైర్మన్ టి.పవన్, ట్రస్ట్ కార్యదర్శి సమీర్, నిలోఫర్ ఆర్‌ఎంఓ-1 డాక్టర్ జ్యోతి, డాక్టర్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గజ పూజోత్సవం



గన్‌ఫౌండ్రీ: ప్రాచీన సంగీత కళలు మన వారసత్వ సంపద అని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఆనంద శంకర జయంత్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సత్విక స్కూల్ ఆఫ్ భరత నాట్యం, కర్ణాటక సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో గజ పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ సంగీత కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు నృత్య గురువులు కమలా నేమాని, ఎస్.ఎన్.సత్యల శిష్య బృందంచే వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్ గిరిజ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'మాధవీలతకు జియాగూడ మద్దతు'


లక్ష్మీనారాయణ

జియాగూడ: హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతకుజియాగూడ డివిజన్ ఓటు బ్యాంకు మంచి మద్దతును ఇస్తుందని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం జియాగూడలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో జియాగూడ డివిజన్ నుంచి బీజేపీకి మంచి పట్టు ఉంది. మూడుసార్లు బీజేపీ నుంచి కార్పొరేటర్లు గెలిచారు. అలాగే దివంగత బద్దం బాల్‌రెడ్డికి సైతం హ్యాట్రిక్ సాధించడానికి జియాగూడ ఓటు బ్యాంకు ఎంతో సహకరించింది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 11 వేలకు పైగా ఓట్లు బీజేపీకి లభించాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం 13500 పై చిలుకు ఓటు బ్యాంకు లభించింది. కార్యకర్తలను సమన్వయంతో ముందుకు తీసుకువెళ్లి ఓటు బ్యాంకు పెరగడంతో పాటు పార్టీ పటిష్టతతో ఉందని దీంతో పార్లమెంటు ఎన్నికల్లో మాధవీలతకు జియాగూడ నుంచి సుమారు 20 వేలకు పైగా ఓట్లు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

'చలం మ్యూజింగ్స్' పుస్తకావిష్కరణ


నివాళులర్పిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: చలం మ్యూజింగ్స్‌లో అతని సమగ్ర మూర్తిమత్వం కనిపిస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో చలం భావన ఆధ్వర్యంలో జీవ జలం చలం సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చలం మ్యూజింగ్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్త్రీ పురుష సంబంధాలు, జీవన తాత్వికత, సామ్యవాదం వంటి గాంభీర్యమైన విషయాలను ఎంత తీవ్రంగా చర్చించాడో సినిమాలు, మూఢ భక్తులను అంతే తీవ్రంగా అపహాస్యంపాలు చేశాడని గుర్తుచేశారు. ఒక చైతన్య స్రవంతిల అతని ఆలోచన ద్వారా ఈ పుస్తకంలో పాఠకులను కట్టిపడేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, చలం భావన కన్వీనర్ నాశేశ్వరం శంకరం, డాక్టర్ సి.మృణాళిని, సీహెచ్ ఉషారాణి, మెర్సీ మార్గరేట్‌లతో పాటు పలువురు రచయిత్రి మణులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

గౌలిపురా: ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని భవానీనగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే రియాజుద్దీన్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశాడు. ఈ పోస్టును మహ్మద్ సల్మాన్, ఆసిఫ్‌తో పాటు మరికొందరు చూసి ఈనెల 16న ఉదయం 5.30 గంటలకు రియాజుద్దీన్‌కు ఫోన్ చేసి తలాబ్‌కట్టా చాచా గ్యారేజీ సలాం చౌక్ వద్దకు పిలిచారు. రియాజుద్దీన్ అక్కడికి వెళ్లేసరికి మహ్మద్ సల్మాన్, ఆసిఫ్‌తో పాటు మరికొంత మంది యువకులు అక్కడి ఉన్నారు. రియాజుద్దీన్ తన బావ ఆలంధార్‌కు అక్కడికి పిలిపించుకున్నాడు. ఆలంధార్ అక్కడికి చేరుకున్న అనంతరం రౌడీషీటర్లు నాజర్, అక్బర్‌తో పాటు ముజ్జును పిలిచాడు. అనంతరం వీరందరూ కత్తులు, కర్రలతో అక్కడికి చేరుకొని గొడవ పడుతున్నారు. పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ అహ్మద్ బిన్ సాధిక్ (29) ఇక్కడ ఎందుకు గొడవ పడుతున్నారి ప్రశ్నించడంతో నాజర్ అహ్మద్ బిన్‌పై కత్తితో దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడికి పాల్పడిన రియాజుద్దీన్, ఆలంధార్, నాజర్‌ను శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ముజ్జు, అక్బర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అమృతలత-అపురూప అవార్డు గ్రహీతలు వీరే..

నాంపల్లి: వివిధ రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న మహిళా మూర్తులకు ఏటా అందజేస్తున్న అమృతలత-అపురూప అవార్డ్స్-2024ను శనివారం ప్రకటించారు. ఈ అవార్డులను ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు తెలుగు వర్సిటీలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రదానం చేస్తారు. సాహిత్యం, వైద్య రంగంలో విశేషమైన కృషి చేసిన డాక్టర్ కె.వి.కృష్ణ కుమారి, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మికి అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తారని ప్రముఖ రచయిత్రి, అవార్డుల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కథ రచన-జి.ఎస్.లక్ష్మి, సాహిత్య విమర్శ-ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ, సినీ విశ్లేషణ-శివలక్ష్మి, రంగస్థలం-దుర్గా భవాని, సామాజిక సేవ-ప్రొఫెసర్ సమతా రోష్ని, పద్య రచన-నండూరి సుందరీ నాగమణి, అంతర్జాల పత్రిక సంపాదకత్వం-డాక్టర్ కొండపల్లి నీహారిణి, సంగీతం(గజల్)-జ్యోతిర్మయి, షార్ట్ ఫిల్మ్స్-అంజనీ యలమంచిలి, నృత్యం-గీత హజారే, జర్నలిజం(ఎలక్ట్రానిక్ మీడియా)-ప్రేమ మాలిని, కవిత్వం-దేవనపల్లి వీణావాణిలకు అపురూప అవార్డ్స్-2024ను అందజేస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, విశిష్ట అతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య అలేఖ్య పుంజాల, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీనటి తులసి హాజరై అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. రచయిత్రి నెల్లుట్ల రమాదేవి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న మారం జగదీశ్వర్, ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రిని బట్టి విక్రమార్కను టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. భట్టి విక్రమార్కను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యోగులకు రావాల్సిన డీఏ విడుదల చేయాలని, పీఆర్సీ, హెల్త్‌కార్డు, సీపీఎస్ రద్దు ఇతర ముఖ్యాంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు కస్తూరి వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, నగర శాఖ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి


సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీసీపీ వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ శైలజ

చాంద్రాయణగుట్ట: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర ట్రాఫిక్ డీసీపీ-3 ఆర్.వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ ఎ.శైలజ ఆదేశించారు. జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు చాంద్రాయణగుట్టలోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ట్రాఫిక్, శాంతి భద్రతలు, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, జలమండలి, వెటర్నరీ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, వీధి దీపాలు, ఆర్టీసీ విభాగాల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలుస్తున్న సమస్యలను అధికారులు జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డీసీలు సురేందర్, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, డిప్యూటీ కమిషనర్(ఎస్‌డబ్ల్యూఎం) రాజేష్‌కుమార్, ప్రాజెక్ట్స్ ఎస్.ఇ దత్తుపంత్, ఎస్.ఇ (నిర్వహణ) మహేశ్వర్ రెడ్డి, జోనల్ సిటీ ప్లానర్ శ్యాంకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీలు చంద్రశేఖర్, బాలాజీ, లక్ష్మణ్, విద్యుత్ డీఈ లింగయ్య, జలమండలి జీఎం ఖాదర్ మొయినుద్దీన్, మలేరియా ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈలు సన్నావుద్దీన్, హరికిశోర్, నరేందర్ గౌడ్, ఏకాంబరం, టౌన్ ప్లానింగ్ ఏసీపీలు అబ్దుల్ ఖాదర్, విఠల్ పాల్గొన్నారు.

ప్రదర్శనశాలలు చరిత్ర జ్ఞాన భాండాగారాలు


మాట్లాడుతున్న భారతి హోలికేరి

నాంపల్లి: చారిత్రాత్మకమైన ప్రదర్శనశాలలను ఆదరించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ భారతి హోలికేరి అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రదర్శనశాలలను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. అంతర్జాతీయ ప్రదర్శనశాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ స్టేట్ మ్యూజియంలోని భగవాన్ మహావీర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె 'మ్యూజియం ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్'అనే అంశంపై ప్రసంగించారు. ప్రదర్శనశాలలు చరిత్ర జ్ఞాన భాండాగారాలని అభివర్ణించారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం గవర్నమెంట్ ఎక్స్‌పర్‌మెంట్ మ్యాన్స్‌స్క్రిప్ట్ లైబ్రరీ అండ్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పాలెపు సుబ్బారావు తాళ, తామ్ర పత్రాలపై అవగాహన కల్పించారు. అలాగే సాలార్‌జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి విచ్చేసి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాముఖ్యతను విశదీకరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు నాగరాజు, నారాయణ, రాములు నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్లు నాగలక్ష్మి, గంగాధరి, ఇన్‌టాక్ హైదరాబాదు చాప్టర్ కన్వీనర్ అనురాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా భావంలోనూ ఆర్యవైశ్యులు నెంబర్ వన్


వేడుకల్లో మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా

అబిడ్స్: సేవా భావంలోనూ ఆర్య వైశ్యులు నెంబర్ వన్ అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు ముందుండి సమాజ సేవకు, సమాజ సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. శనివారం వాసవీ మాత జయంత్యుత్సవాల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ గుప్తా మాట్లాడుతూ..ఆర్యవైశ్యుల దైవం వాసవీ మాత అన్నారు. సమాజ సేవా దృక్పథంతో సేవ చేసేందుకు ఆర్యవైశ్యులు ముందుండాలని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మిక భావాలతోనే మానసిక ప్రశాంతత


వేడుకల్లో ముక్క కృష్ణాగుప్తా

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణ గుప్తా పేర్కొన్నారు. లక్డీకాపూల్‌లోని వాసవీభవన్‌లో జరిగిన వాసవీ మాత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యులంతా ముందుంటారన్నారు. వాసవీ మాత ఆశీస్సులతో సమాజ సేవ చేసేందుకు ప్రతి ఆర్యవైశ్యుడు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం'


కురాకుల కృష్ణ

గోల్కొండ: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పతనమై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అదే విధంగా కేంద్రంలో పదేళ్ల అరాచక పాలన అంతం కావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ కార్వాన్ ఏ బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. కేవలం రాముడి పేరు చెప్పుకుంటూ ఓట్లు అడుగుతున్న బీజేపీ ప్రభుత్వం నైజాన్ని దేశ ప్రజలు గుర్తించారని కాంగ్రెస్ రాహుల్ గాంధీ సారధ్యంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకుంటుందని ఆయన అన్నారు.

తాగునీటి, విద్యుత్ సమస్యను పరిష్కరించండి


ఆశీష్‌కుమార్

అబిడ్స్: విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కొద్దిపాటి వర్షం కురిసినా నియోజకవర్గంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో గంటల కొద్ది విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే విద్యుత్ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ప్రతిరోజూ నరకం చూస్తున్నారన్నారు. అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించనిచో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా యజ్ఞ మహోత్సవం


యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

జియాగూడ: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్వాన్ పంచముఖ బ్రహ్మ ఆలయంలో విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు సి.నరహరిచారి, ప్రధాన కార్యదర్శి అనంత చారి, కోశాధికారి రాగిపణి ప్రేమ్‌చారి, కార్యదర్శి వై.అనిల్‌చారి, సభ్యులు నర్సింహాచారి, దేవేందర్‌చారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా పంచముఖ బ్రహ్మ నిత్య పూజలు, పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన, యజ్ఞ మహోత్సవం, అఖండ హారతి, మహా నైవేద్యం, ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం క్రాంతిభవన్ భజనమండలి, విశ్వాంజనేయ భక్త సమాజం, కిశోర్ మండలిలచే భజన కార్యక్రమం జరిగింది. అలాగే ఆదివారం నిత్య పూజలు, చక్రతీర్థం, స్వామివారి పల్లకీ సేవా, ఊరేగింపుతో ఆరాధన ఉత్సవాలు ముగుస్తాయని కోశాధికారి ప్రేమ్‌చారి తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలి


మాట్లాడుతున్న రాజశేఖర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీని అమలు చేయాలని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ దళిత్ ఇండస్ట్రీ జాతీయ చైర్మన్ ఎర్రతోట రాజశేఖర్ అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీలు ఇవ్వకుండా అణచివేసిందని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. టీ ప్రైడ్ పాలసీ కింద బకాయి పడిన నిధులను విడుదల చేయాలని కోరాడు. భూదాన్ పోచంపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో దళిత్ ఇండస్ట్రీ ప్రతినిధులు ప్రశాంత్, లక్ష్మణ్, తిరుపతయ్య, ధరణి తదితరులు పాల్గొన్నారు.

సోమ క్షత్రియ నకాష్ సంఘం వార్షికోత్సవం



చార్మినార్: సోమ క్షత్రియ నకాష్ సంఘం వార్షికోత్సవ వేడుకలు శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. హైదరాబాద్-సికింద్రాబాద్-పాతబస్తీకి చెందిన పలువురు ప్రతినిధులు, సంఘం సభ్యులు ఈ వేడుకలకు హాజరై ఆత్మీయ పలకరింపులు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మాతా నిముషాంబికా దేవీ చిత్ర పటానికి పూలు మాలలు వేసి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. 1974లో ఏర్పాటైన తమ సంఘం అప్పటి నుంచి ప్రతి ఏడాది ఈ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎస్.మహేష్ వర్మ, సభ్యులు రాజేశ్వర్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం రాష్ట్ర ఓబీసీ విభాగం ఇన్‌చార్జి ఆర్.దీపేష్ రాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముురుగు..పరుగు


ఖాజీగల్లి చౌరస్తాలో..

గోల్కొండ: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లో పలు చోట్ల, గోల్కొండ ఖాజీ గల్లి చౌరస్తా వద్ద డ్రైనేజీలు పొంగిపొర్లుతుంది. మోతీదర్వాజా నుంచి మోతీమహల్ వరకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా నదీమ్ కాలనీలో సైతం పలు డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఎన్నికల సాకుతో అధికారులు డ్రైనేజీల పూడికతీతలు, ధ్వంసమైన మ్యాన్‌హోళ్లను మార్చడం పూర్తిగా మరచిపోయారు. అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని పలువురు అంటున్నారు. ఏదేమైనా గంట పాటు కురిసిన వర్షానికి డ్రైనేజీల దుస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో మరేలా ఉంటుందో అని పలువురు అంటున్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సుల్తాన్‌బజార్: వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంత్యుత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇసామియాబజార్‌లోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం దగ్గర జరిగిన ఉత్సవాల్లో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి 102 కిలోల లడ్డుతో అమ్మవారిని అలంకరించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మహిళలు కలశ పూజలను నిర్వహిం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. లలితా సహస్ర నామాలను పఠిస్తూ కుంకుమార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొమిరి శెట్టి అనిల్‌కుమార్, అధ్యక్షుడు, అలంపల్లి రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రం లక్ష్మణ్, కోశాధికారి పాల్గొన్నారు.

దూద్‌బౌలిలో..

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని వాసవీ భవన్‌లో శనివారం ఉదయం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వాసవీ భవనం అధ్యక్షురాలు దోరేటి పద్మజ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పలువురు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆర్య వైశ్య మహిళా మండలి ప్రతినిధులు పావని, రాధిక, రత్నమాల, వాణి, మంజుల, అనిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

దబీర్‌పురా: కోమటివాడిలో శ్రీ వాసవీమాత అమ్మవారి జన్మదినం సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సభ్యులు విశేష పూజలు, అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పుష్పార్చన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొంగులూరి రాంమూర్తి శాస్త్రి, విశ్వం పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.